క్లుప్తంగా

నూతన వైద్య విధానంపై అవగాహన ఉండాలి



వైద్యునికి జ్ఞాపిక అందిస్తున్న ఎంపీ పోచా

నంద్యాల టౌన్: పట్టణంలోని ఉదయానంద హాస్పిటల్లో అకాడమీ ఆఫ్ పెయిన్ మెడిసిన్, ఉదయానంద హాస్పిటల్ సంయుక్త నిర్వహణలో అనస్తీషియా వైద్యులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ ముగింపు సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు ఎప్పటికప్పుడు నూతన వైద్య విధానాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు.

అభివృద్ధి పథంలో నంద్యాల

నంద్యాల(సిటీ): నంద్యాల పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా అన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నా కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. సోమవారం వైఎస్సార్ నగర్‌లో రూ.1.52 కోట్లతో పలు అభివృద్ధి పనులకు కౌన్సిలర్ సావిత్రమ్మతో కలిసి భూమి పూజ చేశారు. వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ రమణ, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

నంద్యాల(సిటీ): రైల్వే ఉద్యోగులకు పాత పెన్షన్ పద్ధతిని అమలు చేయాలని రైల్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రైల్వే స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. గుంటూరు డివిజన్ బ్రాంచ్ సెక్రటరీ రంగయ్య మాట్లాడుతూ జాతీయ కమిటీ ఆదేశాల మేరకు నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. రైల్వే ఉద్యోగులకు కొత్తగా అమలు చేస్తున్న పెన్షన్ విధానాన్ని తొలగించి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ చైర్మన్ ప్రకాష్‌బాబు, వెంకటేశ్వర్లు, రమణ, నాగమణి, హుసేన్, గుంతకల్లు డివిజన్ సెక్రటరీ ఎం.వెంకటేశ్వర్లు, ట్రెజరర్ హుసేన్ పాల్గొన్నారు.

కుష్టు సర్వే పక్కాగా చేయాలి



అధికారులకు సూచనలు చేస్తున్న చంద్రశేఖర్

గోస్పాడు: కుష్టు వ్యాధి సర్వేను పక్కాగా నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లెప్రసీపై గ్రామాల్లో జరుగుతున్న సర్వేను సిబ్బంది నిర్లక్ష్యం చేయరాదన్నారు. జిల్లాలో డిసెంబర్ 27 నుంచి ఈనెల 12వ తేదీ వరకు ఆశా కార్యకర్తలు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి చేస్తున్న సర్వే చేస్తున్నట్లు చెప్పారు. గోస్పాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పసురుపాడు గ్రామంలో ఆశా కార్యకర్తలు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి నిర్వహిస్తున్న సర్వేను తనిఖీ చేశారు.

ఉపాధి పనులు ప్రారంభించాలి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధి పనులు ప్రారంభించి, కష్ట జీవులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. సోమవారం సీపీఐ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ ధర్నా చేపట్టారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాధాకృష్ణ, సుబ్బరాయుడు మాట్లాడారు.

క్రీడా మైదానం ప్రారంభం



క్రీడా మైదానాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ, ఏఎస్పీ

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని శాంతినికేతన్ సీబీఎస్‌ఈ విద్యాసంస్థల్లో సింథటిక్ టర్ఫ్ గ్రౌండ్ గేమ్స్ గెలాక్సీని జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, శాంతినికేతన్ విద్యాసంస్థల అధినేత సుధాకర్ ప్రారంభించారు. సోమవారం పాఠశాలలో జాతీయ జెండాను ఎగురవేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

వెంకటసుబ్బయ్యకు సన్మానం



వెంకటసుబ్బయ్యను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): ఏపీ రాష్ట్ర పద్మశాలీ మహాసభల ఆహ్వాన సంఘం కో చైర్మన్‌గా ఎన్నికైన ఉమ్మడి కర్నూలు జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు భీమనపల్లె వెంకటసుబ్బయ్యను సన్మానించారు. స్థానిక సంఘం కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలీయ సంఘం సభ్యులు నరసింహులు ఆయనను సన్మానించారు.

జైలుకు వెళ్లి పింఛన్ పంపిణీ

శిరివెళ్ల: కోటపాడుకు చెందిన వితంతు సరస్వతిని పోలీసులు ఓ హత్య కేసులో అరెస్ట్ చేసి కర్నూలు మహిళా కారాగారానికి తరలించారు. అయితే ఆమెకు పింఛన్ అందజేయడానికి గ్రామ వలంటీర్ చాంద్‌బాషా అక్కడికి వెళ్లి జైలు అధికారుల అనుమతితో వితంతు పింఛన్ మొత్తాన్ని ఈ నెల 6న ఆమెకు అందజేశాడు.

గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడంతో రోడ్లపైనే మురుగు నీరు ప్రవహించేంది. అలాగే వీధుల్లోని గుంతల్లో ఆ నీరు నిలిచి దుర్గంధం వెదజల్లేది. దోమలకు ఆవాసాలుగా మారి ప్రజలు వ్యాధులబారిన పడేవారు. సమస్యను ప్రాధాన్యతగా తీసుకొని పరిష్కరించాలని గత ప్రభుత్వ హాయంలో ప్రజలు కోరినా స్పందన కొరవడింది. కంటి తుడుపు చర్యగా కేవలం కొన్ని గ్రామాల్లో, కొన్ని వీధుల్లో మాత్రమే సీసీ రోడ్లు వేసి డ్రైనేజీలు నిర్మించకుండా వదిలేశారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వాటి నిర్మాణాలను పూర్తి చేయడంతో సమస్య పరిష్కారమవడంతో గ్రామీణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



దొర్నిపాడు బీసీ కాలనీలో డ్రైనేజీ నిర్మించడంతో పరిశుభ్రంగా సీసీ రోడ్డు

- మండలంలో డ్రైనేజీ వ్యవస్థ పటిష్టం
- వీధుల్లో సీసీ రోడ్లు
- గడప గడపకు, ఎమ్మెల్యే నిధులతో నిర్మాణ పనులు
- ప్రజలకు తొలగిన ఇబ్బందులు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామీణులు

ఇది కదా అభివృద్ధి

బురద, మురుగు కష్టాలకు చెక్



భాగ్యనగరంలో నూతనగా నిర్మించిన సీసీరోడ్డు, డ్రైనేజీ



క్రిష్టిపాడులో డ్రైనేజీ ఏర్పాటు చేసిన దృశ్యం



కొండాపురంలో డ్రైనేజీ నిర్మించిన దృశ్యం

దొర్నిపాడు: ఒక్కప్పుడు కొన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు వేసినా వాటికి ఇరువైపులా మురుగు కాలువలు నిర్మించకపోవడంతో మురుగు నీరు రోడ్లపైనే ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఆ రోడ్లపై నడవడానికి, ద్విచక్రవాహనాల్లో వారు జారిపడటం జరిగేది. ఇక వాహనాలు వేళ్ల క్రమంలో వాటి వేగానికి మురుగునీరు ప్రజలపై, రోడ్డుపక్కనున్న ఇళ్లల్లోకి చిట్లేది. సమస్య గురించి తెలిసినా గతంలోని ప్రజాప్రతనిధులు పట్టించుకోకపోవడం, ప్రజలు విన్నవించినా చూద్దాం.. అంటూ మాటలకే పరిమితకావడంతో వారికి ఇబ్బందులు కొనసాగాయ. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాకా పల్లెల్లో సీసీరోడ్లతో పాటు డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టడంతో పల్లెవాసులకు బురద, మురుగు కష్టాలు తప్పాయి.

దోమలకు నిలయాలుగా..

గతంలో పల్లెల్లోని సీసీ రోడ్లకు ఇరువైపులా మురుగు కాల్వలు ఏర్పాటు చేయకపోవడంతో రోడ్లు కాల్వలను తలపించేవి. ప్రస్తుతం వాటికి ఇరువైపులా డ్రైనేజీ కాల్వలు తవ్వేందుకు వీలు లేక పోవడంతో సీసీ రోడ్డును కటింగ్ చేయించి కాల్వలు ఏర్పాటు చేశారు. అలాగే ఇళ్ల ముందు గుంతలు తవ్వుకునేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అంతేగాకుండా గ్రీన్ అంబాసిడర్లతో శుభ్రం చేస్తుండటంతో దోమలకు నిలయాలుగా మారిన గ్రామాలు ప్రస్తుతం పరిశుభ్రంగా మారుతున్నాయి.

గడప గడపకు నిధులతో..

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే గ్రామంలో పర్యటించినప్పుడు అధికంగా స్థానికుల నుంచి సీసీ రోడ్లు, డ్రైనేజీలకు సంబంధించినవే వస్తుండటంతో ప్రభుత్వం సమస్య పరిష్కారానికి ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు కేటాయించింది. మండలంలో 9 సచివాలయాలు, గ్రామ పంచాయతీలు 11, మొత్తం గ్రామాలు 14 ఉండగా వాటి పరిధిల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టారు.

మురుగు సమస్య తొలగింది



మేం బీసీ కాలనీలో నివాసముంటున్నాం. 20 ఏళ్లుగా రోడ్లు, డ్రైనేజీ సదుపాయం లేకపోవడంతో రోడ్లపై మురుగు పారేది. అందులో నడిచాం. దీంతో కాళ్లకు పుండ్లు పడేవి. ప్రస్తుతం అధికారులు మా కాలనీలో సీసీరోడ్డుతో పాటు డ్రైనేజీ కాల్వలను నిర్మించడంతో ఇబ్బందులు తొలిగాయి. ప్రస్తుతం రోడ్డుపై చుక్క మురుగునీరు కూడా పారడం లేదు. గడప గడపకు వచ్చిన ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డికి మా సమస్యను వివరించడంతో వెంటనే రోడ్డు వేయించారు. అందుకు కృతజ్ఞతలు

–ఏడుకొండలు, దొర్నిపాడు

సీసీ రోడ్డు , డ్రైనేజీ నిర్మించారు



గ్రామంలోని మైనార్టీ కాలనీలో నివాసం ఉంటున్నాం. గతంలో సీసీ రోడ్డు వేసి మురుగు కాల్వ నిర్మించలేదు. దీంతో కాలనీ అంతా మురుగు రోడ్డుపై పారడంతో ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం సర్పంచ్ కాలనీలో డ్రైనేజీ కాల్వను ఏర్పాటు చేయించడంతో సమస్య తీరింది. దుర్వాసన నుంచి బయటపడ్డాం.

– చిన్నబాషా, క్రిష్టిపాడు

రాకపోకలకు ఇబ్బందులు లేవు



ప్రస్తుతం నిర్మించిన సీసీరోడ్లకు ఇరు వైపులా మురుగు కాల్వలు నిర్మించడంతో రాకపోకలకు ఇబ్బందులు లేవు. గతంలో సీసీరోడ్లు వేసినా లాభం లేదు. ఎందుకంటే మురుగునీరంతా రోడ్లపైనే పారేవి. దీంతో ద్విచక్రవాహనాల్లో ప్రయాణం చేసేప్పుడు అదుపు తప్పి చాలా సార్లు కిందపడ్డాం. నాడు రోడ్లపై నడవడానికి కూడా వెనకాడేవాళ్లం.

–ప్రతాప్, దొర్నిపాడు

వందశాతం పరిశుభ్రతే లక్ష్యం



మా గ్రామ పంచాయతీలోకి భాగ్యనగరం గ్రామం కూడా వస్తుంది. రెండు గ్రామాల్లో వంద శాతం సీసీరోడ్లు వేయించాం. అలాగే రోడ్లపై చుక్క మురుగునీరు కనిపించదు. ప్రస్తుతం రూ.10 లక్షల ఎంపీ ల్యాడ్స్‌తో భాగ్యనగరంలో డ్రైనేజీ పనులు చేయిస్తున్నాం. గ్రామాల పరిశుభ్రతే లక్ష్యంగా పనులు చేస్తున్నాం. మురుగు కాల్వలను గ్రీన్ అంబాసిడర్ల ద్వారా శుభ్రం చేయిస్తున్నాం.

– మాధవీలత, సర్పంచ్, కొండాపురం

మండలంలో ప్రత్యేకంగా డ్రైనేజీ నిర్మాణాలకు విడుదలైన నిధులు..

మండలం	గ్రామం
భాగ్యనగరం	రూ.12లక్షలు (డ్రైనేజ, సీసీరోడ్లు) మరో రూ.10లక్షల ఎంపీ ల్యాడ్స్ మంజూరు
కొండాపురం	రూ.5లక్షలు
క్రిష్టిపాడు	రూ.4లక్షలు
దొర్నిపాడు	రూ.30లక్షలు (సీసీరోడ్లు, డ్రైనేజీ)
రామచంద్రాపురం	రూ.5లక్షలు
బుర్రారెడ్డిపల్లె	రూ.10లక్షలు (సీసీరోడ్లు, డ్రైనేజీ)

మాట నిలబెట్టుకున్నాం

నంద్యాల(అర్బన్): ఎన్నికల సమయంలో అవ్వాతాతలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ పింఛన్ మొత్తాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.3వేలకు పెంచారని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో కొత్తగా 713 మందికి పింఛన్లను పంపిణీ చేశారు. ఎంపీడీఓ సుగుణశ్రీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, ఎంపీపీ ప్రభాకర్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ విజయశేఖర్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి, ఎంఈఓ బ్రహ్మానాయక్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చిన నాయకుడు జగనన్న

నంద్యాల(సిటీ): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత నెరవేర్చిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాత్రమేనని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని గాంధీనగర్ బొగ్గులైన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా స్థానికుల నుంచి ఆయనకు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి పథకాల అమలు, లబ్ధిని వివరించి, సమస్యలను అడిగి తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా, రాష్ట్ర దృశ్య కళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, తహసీల్దార్ శ్రీనివాసులు, సచివాలయాల కన్వీనర్ దాల్‌మిల్ అమీర్, నాయకులు అమృతరాజ్, లక్ష్మీనారాయణ, కిరణ్ కుమార్, మా బాషా, ఆంజనేయులు పాల్గొన్నారు.



దివ్యాంగుడికి కొత్త పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

అవి-ఇవి

యువకుడిపై దాడి

రుద్రవరం: మండలంలోని పెద్దకంబలూరు, పందిర్లపల్లె గ్రామాల మధ్య వాగు వద్ద సోమవారం రాత్రి సమీర్ అనే యువకుడిపై గుర్తు తెలియని దుండగులు దాడి చేసి గాయపరిచారు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు..సమీర్ నిత్యం పెద్దకంబలూరు నుంచి పందిర్ల పల్లెకు వెళ్లి పాలు సేకరించేవాడు. దినచర్యలో భాగంగా పాల సేకరణ పూర్తి చేసి మోటర్ సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా గుర్తు తెలియని దుండగులు తలపై హెల్మెట్లు ధరించి దాడికి పాల్పడ్డారు. అటువైపు నుంచి ప్రజల రాకను గుర్తించి పారి పోయారు. అటుగా వచ్చిన వారు గాయపడిన యువకుడిని రుద్రవరానికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ దాడి ఘటన తమ దృష్టికి తచ్చిందని విచారణ చేపట్టామని తెలిపారు.

రూరల్ సీఐగా శివకుమార్‌రెడ్డి

బొమ్మలసత్రం: నంద్యాల తాలూకా రూరల్ సీఐగా శివకుమార్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ సాధారణ బదిలీల్లో భాగంగా చిత్తూరు జిల్లా సత్యవీడు నుంచి బదిలీపై వచ్చినట్లు చెప్పారు.

విజయవంతం చేద్దాం

ఉయ్యాలవాడ : మండల స్థాయిలో ఈ నెల 10వ తేదీ నుంచి జరగనున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను విజయవంతం చేద్దామని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 10న బ్యాడ్మింటన్, 11 వాలీబాల్, 12న ఖోఖో, 13న కబడ్డీ, 17–20వ తేదీ వరకు క్రికెట్ పోటీలను నిర్వహిస్తామని చెప్పారు.

చట్టాన్ని నిష్పక్షపాతంగా అమలు చేయాలి

నంద్యాల(అర్బన్): ఎస్సీ,ఎస్టీ చట్టాన్ని నిష్పక్షపాతంగా అమలు చేసి నిందితులను తక్షణమే అరెస్ట్ చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ కోరారు. సోమవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చట్టాన్ని దేశ వ్యాప్తంగా అమలు చేయాలన్నారు. అనంతరం డీఆర్‌ఓ పుల్లయ్యకు వినతి పత్రం అందజేశారు. సత్యనారాయణమాదిగ, రవికుమార్ మాదిగ, లక్ష్మణరావు మాదిగ, బాపిరాజు మాదిగ పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు

చాగలమర్రి: సంక్రాంతి పండుగ ముందస్తు వేడుకలను మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో నున్న బర్ఫ్స్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ పాల్‌రాజారావు విద్యార్థులకు పండుగ విశిష్టతను వివరించారు. నేటి పిల్లలకు పండుగ, సంప్రదాయాలను తెలియజేయాల్సిన అవసరముందన్నారు. భోగి మంటలు వేసి సంప్రదాయ దుస్తులతో ఉపాధ్యాయులతో కలిసి నృత్యం చేశారు. పలువురు విద్యార్థులు హరిదాసు వేషధారణ, గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సంప్రదాయ మిఠాయిలు, భోజనం విద్యార్థులకు పంపిణీ చేశారు.

సారా విక్రేత అరెస్ట్

శిరివెళ్ల: యర్రగుంట్లకు చెందిన సారా విక్రేతను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ సురేష్ సోమవారం తెలిపారు. యర్రగుంట్లకు చెందిన పకీరయ్య బస్ స్టాప్ వద్ద సారా అమ్ముతున్నాడనే సమాచారం మేరకు దాడి చేసి అతని నుంచి 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని ఆళ్లగడ్డ కోర్టులో హాజర్ పరిచామని చెప్పారు.

ఆర్‌బీకేల్లో జొన్నల కొనుగోళ్లు

దొర్నిపాడు: మండలంలోని వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లో జొన్నలను కొనుగోలు చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి సునీత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం రూ.3,180 మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని, జొన్న సాగుచేసిన రైతులు వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

స్పందనపై నిర్లక్ష్యం తగదు

ఉయ్యాలవాడ : స్పందన కార్యక్రమంపై అధికారులు నిర్లక్ష్యం వహించరాదని తహసీల్దార్ రవికుమార్ సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ట్రాన్స్‌కో ఏఈ గురప్ప, వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్, హౌసింగ్ ఏఈ నరసింహరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు మాత్రమే హాజరయ్యారు. వైద్యం, విద్య, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, మైనర్ ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, ఉపాధి తదితర శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు అందజేసిన అర్జీలను తహసీల్దార్ స్వీకరించారు.

కుక్కల బెడద తగ్గిస్తాం

నంద్యాల(సిటీ): పట్టణంలో వీధి కుక్కల బెడద తగ్గిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా తెలిపారు. పుర వీధుల్లో సంచరిస్తున్న వీధి కుక్కలకు ఏబీసీ (యాంటీ బర్త్ కంట్రోల్) ఆపరేషన్లు చేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సోమవారం పట్టణ శివారులోని డంపింగ్‌యార్డులో వీధికుక్కల ఆపరేషన్ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డితో కలిసి పరిశీలించారు.

డిప్యూటీ తహసీల్దార్ మృతి



వెంకటస్వామి (ఫైల్)

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటస్వామి (53) సోమవారం మధ్యాహ్నం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్య సేవల కోసం కర్నూలు, హైదరాబాద్‌లో చికిత్స పొందారు. ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో తుది శ్వాస విడిచారు. మృతి పట్ల తహసీల్దార్ రవికుమార్, డిప్యూటి తహసీల్దార్ తులసీకృష్ణ, ఆర్ఐ సత్తార్, వీఆర్ఓలు, సిబ్బంది సంతాపం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆళ్లగడ్డ: చింతకుంట శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. దొర్నిపాడు మండలం భాగ్యనగరం గ్రామానికి చెందిన ఆంజనేయులు, లక్ష్మీదేవి దంపతులు అవసరం నిమిత్తం ద్విచక్రవాహనంపై ఆళ్లగడ్డకు బయలుదేరారు. ఇంతలో వెకనవైపు నుంచి వేగంగా వస్తున్న కారు ఢీ కొట్టింది. దీంతో ఇద్దరికీ గాయాలవగా ఆళ్లగడ్డ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం లక్ష్మీదేవిని నంద్యాలకు తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

గోస్పాడు: సచివాలయ హెల్త్ సెక్రటరీల సమస్యలను పరిష్కరించాలంటూ ఏపీ విలేజ్, వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీ రాష్ట్ర అధ్యక్ష ఉపాధ్యక్షులు స్నేహలత, మన్నె విజయలక్ష్మి కోరారు. సోమవారం ఆరోగ్య శాఖ మంత్రి రజిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం క్యాలెండర్లను ఆవిష్కరించారు.

రేపటి నుంచి క్రీడాపోటీలు

శిరివెళ్ల: ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. పోటీలకు గోవిందపల్లె, యర్రగుంట్ల, మహదేవపురం జెడ్పీ ఉన్నత పాఠశాలల మైదానాలను ఎంపిక చేశామన్నారు. యర్రగుంట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బ్యాడ్మింటన్, వాల్‌బాల్ పోటీలు జరుగుతాయన్నారు.

జగనన్నతోనే సంక్షేమాభివృద్ధి కొనసాగింపు





చాగలమర్రిలో నూతన పింఛన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, హాజరైన లబ్ధిదారులు

చాగలమర్రి: సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు కొనసాగాలంటే మనమందరం మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎస్సార్ ఫంక్షన్ హాల్‌లో ఎంపీడీఓ మహబూబ్‌దౌలా ఆధ్వర్యంలో జేసీఎస్ జిల్లా అధ్యక్షుడు షేక్ బాబూలాల్, జెడ్పీటీసీ జి.లక్ష్మీదేవి, , పార్టీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి ఎంపీపీ వీరభద్రుడు అధ్యక్షత నిర్వహించిన వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పంచాయితీల పేరిట ప్రజల సొమ్ము కాజేసి, దౌర్జన్యాలకు పాల్పడేవారు కావాలా?, శాంతిని నెలకొల్పే నాయకులు కావాలో మీరు నిర్ణయించుకోవాలని స్థానికులకు సూచించారు. నాలుగున్నరేళ్లుగా నియోజకవర్గం ప్రశాంతంగా ఉందని, ఇది కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. 2014 ఎన్నికల్లో అనేక రకాల హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ వాటిని పట్టించుకోకపోవడంతో 2019లో జనం వారిని ఇంటికే పరిమితం చేశారు. మరోసారి బూటకపు వాగ్దానాలు చేసేందుకు మీ వద్దకు వస్తున్నారని, వారిని నమ్మొద్దని సూచించారు. జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు జి.గణేష్ రెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షుడు శేషురమేష్, సహకార సొసైటీ అధ్యక్షుడు దస్తగిరి, మండల ఉపాధ్యక్షుడు ముల్లా రఫీ, ఎంపీటీసీలు లక్ష్మీరెడ్డి, ఎం.ఫయాజ్, పత్తినారాయణ, బేబమ్మ, సర్పంచ్‌లు తులసమ్మ, బంగారు షరీఫ్, ప్రతాప్‌రెడ్డి, ఉప సర్పంచ్ వెంకటసుబ్బారెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షులు వెంకటరమణ, ముల్లా ఖాదర్‌బాషా, జనరల్ సెక్రటరీలు శ్రీనివాసులు, మల్లారెడ్డి, నాయకులు మల్లేశ్వర రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

జలకళ సామగ్రి పంపిణీ

చాగలమర్రి: మండలంలోని మద్దూరు గ్రామంలో రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, జగనన్న కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సోమవారం శిలాఫలకం ఆవిష్కరించి ప్రారంభించారు. ఏడీ రామ్మోహన్‌రెడ్డి, ఏఓ రంగనేతాజీ ఆయనకు స్వాగతం పలికారు. ఆర్‌బీకే వ్యవసాయ కార్యదర్శి మణికి తాళాలను అందజేశారు. అనంతరం జలకళ పథకం ద్వారా ఒక్కొక్కరికి సుమారు రూ.4 లక్షల విలువ జేసే సామగ్రి మంజూరు కావడంతో ఏపీడీ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందజేశారు.

పింఛన్ల పంపిణీ



కడపలో అర్లప్పకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ చింతల దీనకుమారి



కొండాపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్

దొర్నిపాడు: నూతన పింఛన్ల పంపిణీ కొనసాగుతుంది. సోమవారం మండలంలోని కొండాపురం గ్రామంలో సర్పంచ్ మాధవీలత నూతన లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. పంచాయతీ కార్యదర్శులు సుమిత్ర, ఉశేని పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని చిన్నకంబలూరుకు చెందిన మల్లెపోగు అర్లప్ప పక్షవాతం కడపలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ చింతల దీనకుమారి సోమవారం అక్కడికి వెళ్లి పింఛన్ సొమ్ము అందజేసింది.

ఉయ్యాలవాడ: హరివరం గ్రామానికి చెందిన మద్దూరు చెన్నయ్య ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. దీంతో వలంటీర్ శశిధర్ వైద్యశాలకు వెళ్లి పింఛన్ సొమ్మును అందజేశాడు.

12న మండల సర్వసభ్య సమావేశం

నంద్యాల(అర్బన్): ఈనెల 12వ తేదీన మండల సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుగుణశ్రీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ శెట్టి ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, మండల శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.